వైభవంగా ఐఫా వేడుక

ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ (ఐఫా)-2024 వేడుక అబుదాబిలో వైభవంగా జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో వివిధ భాషలకు చెందిన అగ్ర తారలు సందడి చేశారు. ఈ వేడుకలో అగ్ర నటుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మకమైన అవార్డును సొంతం చేసుకున్నారు. 'ఔట్ స్టాండింగ్ అచీవ్ మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' పురస్కారాన్ని గెలుచుకున్నారు. అగ్రనటుడు బాలకృష్ణ గోల్డెన్ లెగసీ అవార్డును అందుకున్నారు. ఉమెన్ ఆఫ్‌ది ఇయర్‌గా సమంత అవార్డును స్వీకరించింది.

'ఐఫా' అవార్డుల విజేతలు..

ఉత్తమ తెలుగు చిత్రం: దసరా
ఉత్తమ నటుడు: నాని
ఉత్తమ దర్శకుడు: అనిల్ రావిపూడి (భగవంత్ కేసరి)
ఉత్తమ తమిళ చిత్రం: జైలర్
ఉత్తమ తమిళ నటుడు: విక్రమ్ (పొన్నియన్ సెల్వన్)
ఉత్తమ తమిళ నటి: ఐశ్వర్యారాయ్ (పొన్నియన్ సెల్వన్)
ఉత్తమ తమిళ దర్శకుడు: మణిరత్నం (పొన్నియన్ సెల్వన్)

మునుపెన్నడూ కనిపించని స్టన్నింగ్ లుక్‌తో

యూత్‌లో విజయ్ దేవరకొండకు ఉన్న ఫాలోయింగ్ సామాన్యమైనదికాదు. సినిమాల ప్రతికూల ఫలితాలు కూడా ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపలేకపోయాయి. ప్రస్తుతం విజయ్ చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి 'జెర్సీ'ఫేం గౌతమ్ తిన్ననూరి సినిమా. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర విభిన్నంగా, భావోద్వేగపూరితంగా ఉంటుందని తెలుస్తున్నది. అలాగే.. 'రాజావారు రాణిగారు' ఫేం రవికిరణ్ కోల దర్శకత్వంలో కూడా ఓ చిత్రం చేయనున్నారట విజయ్ దేవరకొండ. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందనుందని సమాచారం. ఇక మూడోది రాహుల్ సంకృత్యన్ సినిమా. విజయ్ దేవరకొండ 'ట్యాక్సీవాలా'తో దర్శకుడిగా పరిచయమైన రాహుల్.. ఆ తర్వాత నానితో 'శ్యామ్‌సింగరాయ్' సినిమా చేశారు. రెండూ హిట్లే. ఇప్పుడు మూడో సినిమా విజయ్ దేవరకొండతో చేయనున్నారాయన. అక్టోబర్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్, కర్నూల్, అనంతపూర్, కడప జిల్లాల్లోని కొన్ని అరుదైన లొకేషన్స్‌లో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. ఇందులో మునుపెన్నడూ కనిపించని విధంగా, స్టన్నింగ్ లుక్‌తో విజయ్ కనిపిస్తారని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. విజయ్ అభిమానులు పండుగ చేసుకునేలా ఆయన కేరక్టరైజేషన్ ఉంటుందట. మొత్తంగా ముగ్గురు వైవిధ్యమైన దర్శకులతో విభిన్నమైన కథలతో సినిమాలు చేస్తూ విజయ్ దేవరకొండ బిజీబిజీగా ఉన్నారు.

అభిమానికి హెచ్చరిక

సినీ తారలకు అభిమానులే బలం. అయితే ఒక్కోసారి వారివల్లే చిక్కుల్లో పడుతుంటారు. హద్దుమీరిన అభిమానం సెలబ్రిటీలకు కోపాన్ని తెప్పిస్తుంది. అలాంటి పరిస్థితినే ఎదుర్కొంది కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ సినిమా వేడుకలో పాల్గొంది ప్రియాంక. ఓ అభిమాని ఆమె దగ్గరకు వచ్చి సెల్ఫీ తీసుకునే ప్రయత్నం చేయగా వొద్దని వారించింది. అంతేకాకుండా అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని హెచ్చరించింది. ఈ సంఘటనతో అక్కడ ఏం జరుగుతుందోనని అతిథులందరూ టెన్షన్ పడ్డారు. ఆ వేడుకలో పాల్గొన్న సీనియర్ నటి శరణ్య ఈ విషయం గురించి వాకబు చేసింది. దాంతో అసలు సంగతి బయటికొచ్చింది. సదరు అభిమాని అంతకుముందు రోజు కూడా ప్రియాంక మోహన్ వెంటపడ్డాడట. షాపింగ్ మాల్ నుంచి ఇంటి వరకు ఆమెను ఫాలో అవుతూ మాట్లాడే ప్రయత్నం చేశాడట. అతను మళ్లీ సినీ ఫంక్షన్‌లో ప్రత్యక్షమై సెల్ఫీ తీసుకునే ప్రయత్నం చేయడం ప్రియాంక మోహన్‌కు కోపాన్ని తెప్పించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల తెలుగులో 'సరిపోదా శనివారం' చిత్రంతో మంచి విజయాన్ని దక్కించుకుంది ప్రియాంక అరుళ్ మోహన్.

క్రైమ్ కామెడీ కనకరాజు

వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకుంటూ నటుడిగా ఎదుగుతున్నారు వరుణ్‌తేజ్. కంచె, గద్దలకొండ గణేష్, తొలిప్రేమ. ఎఫ్ 1, ఎఫ్ 2.. ఇలా పొంతన లేని పాత్రలతో భిన్నమైన ఇమేజ్‌ను సాధించారాయన. ప్రస్తుతం వరుణ్ చేస్తున్న సినిమా 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ డ్రామా ఇది. గాంబ్లింగ్ గేమ్ నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా కరుణకుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో కూడా వరుణ్‌ది వైరైటీ కేరక్టరే. ఇదిలావుంటే.. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో సినిమాకు పచ్చజెండా ఊపారు వరుణ్‌తేజ్. క్రైమ్ కామెడీ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నది. ఈ సినిమాకు 'కనకరాజు' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. దాదాపు ఇదే టైటిల్ ఫైనల్ అయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. నవంబర్‌లో షూటింగ్ స్టార్ట్ అయ్యే ఈ సినిమాలో కమెడియన్ సత్య పాత్ర కీలకంగా ఉంటుందని సమాచారం.

కన్నడ పంపిణీరంగంలోకి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

తెలుగులో వరుసగా భారీ చిత్రాలు నిర్మిస్తూ టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా పేరు తెచ్చుకుంది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. సక్సెస్‌ఫుల్ సినిమాలు తీస్తూ అభిరుచిగల నిర్మాతగా సత్తా చాటుతున్నారు సంస్థ అధినేత టీజీ విశ్వప్రసాద్. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కన్నడ డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి అడుగుపెడుతున్నది. కేఆర్‌జీ స్టూడియోస్‌తో కలిసి అక్కడ సినిమాలను పంపిణీ చేస్తామని, మంచి కంటెంట్‌కు ప్రాధాన్యతనిస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు.

వేడుకలో ఉన్నది కాలం

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకుడు. సీఏఎం ఎంటర్టైన్మెంట్స్‌తో కలిసి విసెల్యులాయిడ్స్ పతాకంపై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమాలోని రెండో పాటను విడుదల చేశారు. 'వేడుకలో ఉన్నది కాలం.. వేదిక ఈ కల్యాణం..' అంటూ సాగే ఈ పాటను సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను జైకృష్ణ స్వరపరచగా ఐశ్వర్య దరూరి, బృందా, చైతు సత్సంగి, అఖిల్‌చంద్ర ఆలపించారు. సుధీర్‌బాబు, సాయిచంద్ పాత్రల అనుబంధాన్ని ఎస్టాబ్లిష్ చేస్తూ ఈ పాట సాగింది. సాహిత్యానికి తగ్గట్టే పాట ఆద్యంతం వేడుకలా ఉంది. ఆర్ణ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ కల్యాణి.

నీలో నాలో కదలాడు భావం ఈ రాగం..

శ్రీవిష్ణు, రీతూవర్మ, మీరాజాస్మిన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'శ్వాగ్'. 'రాజ రాజ చోర'ఫేం హసిత్ గోలి దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 4న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా చిత్రంలోని 'నీలో నాలో.. కదలాడు భావం ఈ రాగం..' అంటూ సాగే మెలోడీ పాటను మేకర్స్ విడుదల చేశారు. భువనచంద్ర రాసిన ఈ పాటను వివేక్ సాగర్ స్వరపరచగా, రాజేష్ కృష్ణన్, అంజనాసౌమ్య ఆలపించారు. ఈ నాస్టాల్జిక్ మెలోడీని శ్రీవిష్ణు, మీరాజాస్మిన్‌లపై దర్శకుడు తెరకెక్కించారు. ఈ పాటలో కాస్ట్యూమ్స్, కంపోజిషన్ అంతా 80s 90s రోజుల్ని గుర్తు చేసేలా ఉంది. దక్ష నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ఆడపిల్ల జీవన ప్రయాణం

రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి లీడ్‌రోల్స్ చేసిన చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర్ యాదవ్ స్వీయదర్శకత్వంలో నిర్మించారు. సిస్టర్ సెంటిమెంట్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 3న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన కేర్ గ్రూప్స్ చైర్మన్ ఏ.ఎం.రెడ్డి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే సినిమా ఇది. ప్రతి ఒక్క కుటుంబానికీ కనెక్టయ్యే కథతో ఈ సినిమా చేశాం. ఒక ఆడపిల్ల చెల్లెలుగా.. ఆ తర్వాత మేనత్తగా.. ఆఖరికి బామ్మగా మారే ప్రయాణమే ఈ సినిమా.' అని దర్శక, నిర్మాత భాస్కర్ యాదవ్ చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: మల్హర్ భట్ జోషి, సంగీతం: శ్రీ వెంకట్, నిర్మాణం: భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా.